కాల్పులు.. బీహార్ ముఠావే

- చార్మినార్ ప్రాంతంలో ట్రావెల్ బ్యాగుల కొనుగోలు
- అందులో దోచిన సొమ్మును దాచిన దుండగులు
- రెండు రాష్ట్రాల పోలీసులు మూడు రాష్ట్రాల్లో గాలింపు
- 10 బృందాలతో హైదరాబాద్ పోలీస్
- అఫ్జల్‌గంజ్ నుంచి సికింద్రాబాద్ ఆటోలో వెళ్లిన దుండగులు రైలులో నగరం విడిచి పరారు..

సిటీబ్యూరో, జనవరి 17 (నమసే తెలంగాణ): బీదర్, హైదరాబాద్‌లో కాల్పులు జరిపిన దోపిడీ దొంగలు బీహార్ ముఠాకు చెందినవారుగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ దోపిడీ దొంగల ముఠా కోసం కోసం రెండు రాష్ట్రాల పోలీసులు కర్ణాటక, తెలంగాణ, ఛత్తీస్‌గడ్‌లలో 10 బృందాలతో గాలింపు చేపట్టారు. గురువారం ఉదయం బీదర్‌లో కాల్పులు జరిపి ఏటీఎం కేంద్రంలో నగదు డిపాజిట్ చేసేందుకు వెళ్తున్న సెక్యూరిటీ సిబ్బందిపై కాల్పులు జరిపి.. వారి చేతిలో ఉన్న అల్యూమినియం బాక్స్‌తో పాటు అందులో ఉన్న రూ. 93 లక్షల నగదును దోపిడీ చేసి పరారైన విషయం తెలిసిందే. ఏపీ రిజిస్ట్రేషన్ ఉన్న ద్విచక్రవాహనంపై హెల్మెట్లు ధరించి దోపిడీకి పాల్పడిన దుండగులు.. అదే బైక్‌పై హైదరాబాద్ వైపు పరారయ్యారు. మార్గమధ్యలో ఆ బైక్‌ను, అల్యూమినియం బాక్స్‌ను వదిలేసి హైదరాబాద్‌కు చేరుకున్నారు. హైదరాబాద్ చేరుకున్న తరువాత చార్మినార్ ప్రాంతంలో ట్రావెల్ బ్యాగ్స్ కొని అందులో ఆ డబ్బును దాచి పెట్టారు. ఆ బ్యాగ్‌లలో తమ వద్ద ఉన్న హెల్మెట్లు కూడా దాచిపెట్టారు. మార్గ మధ్యలో బైక్‌లు దొంగిలించి, తమ వద్ద ఉన్న హెల్మెట్లను వాడుతూ.. తమ ముఖాలు ఎక్కడ బయట పడకుండా జాగ్రత్త పడుతుంటారని తేలింది.

నిందితుల గుర్తింపు...

రెండు రాష్ట్రాల పోలీసులకు సవాలు విసిరిన దోపిడీ దొంగల ఆచూకీని శుక్రవారం రాత్రి పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. ఆ దిశగానే నిందితులను పట్టుకోవడానికి గాలింపు ముమ్మరం చేసినట్లు విశ్వసనీయ సమాచారం. అయితే పోలీసులు ఈ విషయాన్ని నిర్ధరించడం లేదు. హైదరాబాద్ దాటి దుండగులు వెళ్లిపోయారని పేర్కొంటున్నారు.

ఆటోలో ఎక్కి సికింద్రాబాద్‌కు..

అఫ్జల్‌గంజ్‌లోని రోషన్ ట్రావెల్స్ వద్దకు వెళ్లి ఛత్తీస్‌గడ్‌లోని రాయ్‌పూర్ వెళ్లేందుకు అమిత్‌కుమార్ పేరుతో రెండు టిక్కెట్లు బుక్ చేసుకున్నారు. టికెట్లు బుక్ చేసుకునే సమయంలో ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ఫోన్ నంబర్‌ను ఇచ్చారు. బస్సు వివరాలు మేసేజ్ పంపిస్తామంటే ఇక్కడే ఉంటామంటూ రాత్రి 7 గంటల వరకు అక్కడే ఉన్నారు. ఈ క్రమంలోనే తమ వద్ద ఉన్న ఫోన్ నంబర్లను దుండగులు స్వీచ్ఛాప్ చేశారు. మినీ బస్సులో ఎక్కిన తరువాత ట్రావెల్స్ మేనేజర్ జహంగీర్‌పై తుపాకీతో కాల్పులు జరిపిన దుండగులు.. అక్కడి నుంచి కొంత దూరం పరిగెత్తుతూ వెళ్లారు. ఆ తరువాత ఒక ఆటోలో ఎక్కి సికింద్రాబాద్ వైపు వెళ్లారు. పోలీసులకు బేగంబజార్, ఎంజే మార్కెట్, నాంపల్లి, ట్యాంక్‌బండ్ వరకు అక్కడక్కడ సీసీ కెమెరాల్లో కొన్ని ఆధారాలు పోలీసులకు లభించాయి. ఆటోను గుర్తించిన పోలీసులు డ్రైవర్‌ను ప్రశ్నించడంతో సికింద్రాబాద్‌లోని అల్ఫా హోటల్ వద్ద వాళ్లను దించినట్లు వెల్లడించారు. దీంతో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి ఇద్దరు దుండగులు ఛత్తీస్‌గడ్, బీహార్ వైపు వెళ్లి ఉంటారని పోలీసులు అనుమానిస్తూ ఆ దిశగా గాలింపు చేపట్టారు. అయితే సీసీ కెమెరాలు పూర్తిస్థాయిలో పనిచేయకపోవడంతో పోలీసులకు తగిన సమాచారం వేగంగా రాలేదని తెలుస్తున్నది. దీంతోనే దుండగులు హైదరాబాద్ దాటేంత సమయం దొరికినట్లు ఆరోపణలున్నాయి.

అభివాదం చేస్తున్న ఆర్.కృష్ణయ్య, మధుసూదనాచారి, కృష్ణమోహన్ రావు, వెంకటస్వామి, గుజ్జ సత్యం, తదితరులు

గల్లీ నుంచి ఢిల్లీ వరకు బలంగా బీసీ నినాదం

రానున్న కాలం బీసీల రాజ్యం: ఆర్.కృష్ణయ్య

కాచిగూడ, జనవరి 17: తెలంగాణలో నిర్వహించే సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లను 20 నుంచి 42 శాతానికి పెంచకుండా ఎన్నికలు నిర్వహిస్తే రాష్ట్రం అగ్ని గుండం అవుతుందని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. బీసీ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం ఆధ్వర్యంలో శుక్రవారం కాచిగూడలోని అభినందన్ హోటల్‌లో జాతీయ బీసీ మేధావుల సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఆర్.కృష్ణయ్య, శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు, ఏఐసీసీ ఓబీసీ ప్రధాన కార్యదర్శి కత్తి వెంకటస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ రానున్న స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం పెంచాలని, ప్రత్యేక అసెంబ్లీ సమావేశాన్ని ఏర్పాటు చేసి, చట్టం చేసి ఎన్నికలకు వెళ్లాని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బీసీ వాదం బలంగా ఉందని, రానున్న కాలం బీసీల రాజ్యమేనని వెల్లడించారు. బీసీలకు కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని, గల్లీ నుంచి ఢిల్లీ వరకు బీసీ నినాదం అత్యంత బలంగా ఉందని, అందుకు రాజ్యాంగాన్ని సవరించాలని డిమాండ్ చేశారు. అనంతరం మధుసూదనాచారి మాట్లాడుతూ, దేశంలో అధిక శాతం బీసీలు ఉన్నారని, ఐనప్పటికీ బానిసలుగా బతుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలు రాజ్యాధికార దిశగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. బీసీలు ఓట్లుగా కాకుండా నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని పేర్కొన్నారు. కేసీఆర్ తెలంగాణ ఉద్యమం లాగా బీసీ ఉద్యమం వచ్చినప్పుడే బీసీల బతుకులు మారుతాయని వెల్లడించారు. కార్యక్రమంలో గొరిగ మల్లేశ్, నీలం వెంకటేశ్, రాజేందర్, వేముల రామకృష్ణ, నందగోపాల్, అనంతయ్య, పి.శ్రీనివాస్ నాయి, రామ్‌దేవ్ మోదీ, జయంతి గౌడ్, రమాదేవి, భాగ్యలక్ష్మితో పాటు మేధావులు, అఖిల పక్ష ప్రజా ప్రతినిధులు, ఉద్యోగ, ఉపాధ్యాయ, న్యాయవాదులు, డాక్టర్లు, వివిధ పార్టీల ప్రజా ప్రతినిధులు, కుల సంఘాలు, మహిళా, యువజన, విద్యార్థి నేతలు పాల్గొన్నారు.

ఫోర్త్ సిటీ రైతులకు భూమికి భూమే ఇవ్వాలి

కలెక్టరు కార్యాలయాన్ని ముట్టడిస్తాం : సీపీఎం నాయకుల డిమాండ్

లేమూరులో రైతులతో మాట్లాడుతున్న సీపీఎం పార్టీ నాయకులు

కందుకూరు, జనవరి 17: ఫోర్త్ సిటీ రైతులకు భూమికి బదులుగా భూమే ఇవ్వాలని సీపీఎం పార్టీ బృందం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫోర్త్ సిటీ రోడ్డు కోసం భూములు కోల్పోతున్న కందుకూరు మండల పరిధిలోని లేమూరు, తిమ్మాపూరు, అగర్‌మియాగూడ గ్రామాల్లో బాధిత రైతులను కలిసి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మండల పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం బలవంతంగా రైతుల భూములను లాక్కోవడాన్ని తమ పార్టీ పూర్తిగా వ్యతిరేకిస్తుందని తెలిపారు. రైతులకు వెన్నంటే ఉంటామని పేర్కొన్నారు. ఎలాంటి సమాచారం, నోటీసులు ఇవ్వకుండా పోలీసులను పెట్టి రైతులను భయభ్రాంతులకు గురిచేసి సర్వే నిర్వహించడం పట్ల ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎవరి ప్రయోజనాల కోసం 330 ఫీట్ల రోడ్డును ఏర్పాటు చేస్తుందని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం తక్షణమే భూములను సేకరించడం ఆపాలని కోరారు. లేనిచో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తామని హెచ్చరించారు. బలవంతపు భూ సేకరణ ఆపకపోతే ప్రజా సంఘాలు, బాధిత రైతులతో కలిసి కలెక్టరు కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కవిత, మధుసూదన్ రెడ్డి, అంజయ్య, సీపీఎం మండల కార్యదర్శి బుట్టి బాలరాజు, మాజీ కార్యదర్శులు అంగాల్ల కుమార్, బడ్డీ రపు శ్రీనివాస్, శేఖర్, శివ శంకర్, లేమూరు మాజీ సర్పంచ్ ఢిల్లీ గణేశ్ ముదిరాజ్, శ్రీకాంత్ రెడ్డి, నారాయణ, బాధిత రైతులు పాల్గొన్నారు.

అత్యవసర వైద్యంపై అవగాహన అవసరం

అడిషనల్ డీజీపీ మహేశ్ ఎం.భగవత్

హైదరాబాద్, జనవరి 17(నమస్తే తెలంగాణ): అత్యవసర వైద్య పద్ధతులపై అందరు అవగాహన కలిగి ఉండాలని అడిషనల్ డీజీపీ మహేశ్ భగవత్ సూచించారు. బేసిక్ లైఫ్ సపోర్ట్ (బీఎల్ఎస్)కోర్సు కార్యక్రమాన్ని రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన అడిషనల్ డీజీపీ మహేశ్ భగవత్ మాట్లాడుతూ, అత్యవసర సమయాల్లో సీపీఆర్ వంటి మెడికల్ సాయాన్ని ఎలా అందించాలో తెలుసుకోవడం చాలా ముఖ్యమని సూచించారు. కుటుంబ సభ్యులకు కూడా ఈ నైపుణ్యాలను నేర్పించి, తక్షణ సహాయం అందించగలిగే విధంగా సన్నద్ధం చేయాలని కోరారు. కార్యక్రమంలో యశోద ఆసుపత్రి వైద్య నిపుణులు డాక్టర్ సురేశ్ కుమార్, డాక్టర్ స్నేహ, డాక్టర్ సుజీత్ బృందం పాల్గొన్నారు. సీపీఆర్(కార్డియో పల్మనరీ రెసిసిటేషన్) చేసే విధానం, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను డీజీపీ కార్యాలయ సిబ్బందికి వివరించారు. ఏఐజీ రమణ కుమార్, డీజీపీ కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ ఉద్యోగుల జోలికొస్తే ఖబడ్దార్

- నిజాయితీతో పనిచేసే బీసీ ఉద్యోగస్తులకు బదిలీల పేర వేధింపులు
- స్వప్రయోజనాల కోసం బెదిరింపులు
- నల్లగొండ జిల్లాలో రెడ్ల పెత్తనం ఇక చెల్లదు
- ఓబీసీ జాక్ చైర్మన్ డాక్టర్ అవ్వారు వేణు కుమార్

మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

సికింద్రాబాద్, జనవరి 17: బీసీ ఉద్యోగులపై జరుగుతున్న అగ్రకుల, ఆధిపత్య రాజకీయ నాయకుల ఆగడాలను అరికట్టాలని ఓబీసీ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ డాక్టర్ అవ్వారు వేణు కుమార్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీ సామాజిక వర్గంలో పుట్టి, తల్లిదండ్రుల వారసత్వంగా వచ్చిన ఆస్తులను అమ్ముకొని ఉద్యోగం సంపాదిస్తే ఆ ఉద్యోగానికి అడ్డంపడే నాయకులు కొందరు తయారవుతున్నారని, ఇది వెంటనే మానుకోకపోతే తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. ఈ మధ్యన ఓ పోలీస్ ఉన్నతాధికారిని తీవ్ర ఒత్తిడికి గురిచేసి వారి వ్యక్తిగత ప్రయోజనాల కోసం సంతకాలు చేయించుకోవాలని బెదిరిస్తున్నారని, ఇలాంటి పోకడలు తెలంగాణ రాష్ట్రంలో ఇక కుదరవని అన్నారు. చిన్న ఉద్యోగం దగ్గర నుంచి మొదలుకొని ఉన్నత ఉద్యోగం చేస్తున్న బీసీ ఉద్యోగస్తులపై అగ్రకుల ఆధిపత్య పోరు కొనసాగుతుందని, నీతి నిజాయితీకి కట్టుబడి ఉంటూ చట్టానికి లోబడి ఉద్యోగం చేస్తుంటే.., చట్టాన్ని చుట్టంగా మలుచుకొని తమ వ్యక్తిగత ప్రయోజనాలు పొందాలని కొంత మంది రాజకీయ నాయకులు చూస్తున్నారని, ఇకపై వారిని సహించేది లేదన్నారు. ప్రధానంగా నల్లగొండ జిల్లాలో రెడ్ల పెత్తనం బాగా పెరిగిపోయిందని బీసీ ఉద్యోగస్తులను ఒక ఆట బొమ్మలా చూస్తున్నారని, రాజకీయ నాయకులకు అనుకూలంగా పని చేయకపోతే బదిలీల పేరుతో, ఏదో ఒక కారణం చెప్పి మెమో జారీ చేస్తామని బెదిరించడం బాధాకరమన్నారు. బీసీ ఓట్లతో గెలిచి బీసీ ఉద్యోగస్తులను బెదిరిస్తే ఊరుకునేదే లేదని, రాబోయే రోజుల్లో బీసీ ప్రజానీకంతోని దెబ్బ కొడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షులు కోట్ల వాసుదేవ్, ఓబీసీ పొలిటికల్ జాక్ కన్వీనర్ ఎస్బీఎన్ చారి, మల్లేశ్ యాదవ్, సురేశ్, నరేశ్ గౌడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

500 టీఎంసీల కృష్ణా జలాలను సాధిస్తాం

రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ చిన్నారెడ్డి

హైదరాబాద్, జనవరి 17(నమస్తే తెలంగాణ): సాగు కోసం 500 టీఎంసీల కృష్ణా జలాలను సాధించేందుకు కేంద్ర ప్రభుత్వంతో ప్రయత్నాలు కొనసాగుతున్నాయని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ చిన్నారెడ్డి తెలిపారు. ప్రస్తుతం 299 టీఎంసీలు మాత్రమే తెలంగాణకు ఇస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. తెలంగాణ అగ్రికల్చరల్ ఆఫీసర్స్ అసోసియేషన్ కేంద్ర సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ కళాశాల ఆడిటోరియంలో 2025 అగ్రికల్చర్ డైరీ, క్యాలెండర్, టేబుల్ క్యాలెండర్, వెబ్‌సైట్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఫిబ్రవరి, మార్చి నెలలో ప్రవేశపెట్టనున్న రాష్ట్ర బడ్జెట్‌లో గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉన్న అన్ని పథకాలను తిరిగి ప్రారంభించడానికి సీఎం ఆలోచన చేస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ అగ్రికల్చరల్ ఆఫీసర్స్ అసోసియేషన్ చైర్మన్ బీ కృపాకర్ రెడ్డి, అధ్యక్షులు డాక్టర్ డీ వైద్యనాథ్, ప్రధాన కార్యదర్శి జీ కృపాకర్ రెడ్డి, కోశాధికారి ఎన్.రవీందర్, సత్యనారాయణ, రంగారెడ్డి, కాంతారావు, కే అనూరాధ, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సీ నరేందర్ రెడ్డి, మాజీ డీన్ విష్ణువర్ధన్ రెడ్డి, తెలంగాణ అగ్రికల్చరల్ సైంటిస్ట్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ బొక్క విద్యాసాగర్ పాల్గొన్నారు.

అర్హులకు అన్యాయం జరగొద్దు

రేషన్ కార్డు సర్వేను పరిశీలించిన కలెక్టర్

సిటీబ్యూరో, జనవరి 17(నమస్తే తెలంగాణ): రేషన్ కార్డుల జారీ కోసం హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శుక్రవారం అధికారులను ఆదేశించారు. మెహిదీపట్నంలోని విజయనగర్ హుమాయూన్ నగర కాలనీలో రేషన్ కార్డుల సర్వేను ఆయన పరిశీలించారు. సర్వే బృందం ఎలా వివరాలు సేకరిస్తుందనే అంశాలు తెలుసుకున్నారు. సర్వేలో తప్పులు లేకుండా బాధ్యతతో నిర్వహించాలని సూచించారు. అర్హులైన వారు ఎవ్వరికి అన్యాయం జరగొద్దని తెలిపారు. రిమార్కులు సైతం పొందుపర్చాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల సంరక్షణకు పటిష్ట చర్యలు

అధికారులకు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశాలు

సిటీబ్యూరో, జనవరి 17(నమస్తే తెలంగాణ): జిల్లాను 28 జోన్లుగా విభజించి ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్ చేపట్టాలని అధికారులను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పిల్లల రక్షణకు తీసుకోవాల్సిన పటిష్ట చర్యలపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. బిక్షాటన చేస్తున్న పిల్లల పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాల కార్మికులకు నష్ట పరిహారం సైతం అందించేలా చూడాలని వివరించారు. పిల్లల తల్లిదండ్రులకు చట్టాలు, హక్కులపై అవగాహన కల్పించాలని కోరారు. అలా గుర్తించిన చిన్నారులను రెసిడెన్షియల్ పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని వివరించారు. ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా 42 స్వచ్ఛంద సంస్థలు, 6 స్రు గుర్తించి అందుకు గల కారణాలను తెలుసుకుని వారికి సరైన విద్య, మంచి జీవితం అందేలా బాధ్యతలు తీసుకోవాలని సూచించారు. బాల కార్మికులను గుర్తించి బాధ్యుల ప్రభుత్వ హోమ్స్‌లో 2,224 మంద చిన్నారులు సంరక్షణలో ఉన్నారని తెలిపారు. ఇందులో 72 మంది పిల్లలను దత్తత అందించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ శైలజ, జిల్లా విద్యాశాఖ అధికారి డి.రోహిణి, డీసీపీ లావణ్య, ఐసీడీఎస్ పీడీ అక్కేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

19న కొమురవెల్లిలో పట్నం వారం

- 50 వేలకు పైగా భక్తులు వచ్చే అవకాశం
- అన్ని ఏర్పాట్లు చేస్తున్న ఆలయ వర్గాలు

విద్యుత్ దీపాల వెలుగులో మల్లన్న ఆలయ రాజగోపురం

చేర్యాల, జనవరి 17: సిద్దిపేట జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొమురవెల్లి మల్లన్న ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాలకు సిద్ధమైంది. గత డిసెంబర్ 28న కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించిన ఆలయ వర్గాలు, ఇప్పుడు బ్రహ్మోత్సవాల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఆలయ ఆచారాలు, సంప్రదాయాల ప్రకారం, సంక్రాంతి తర్వాత వచ్చే మొదటి ఆదివారంతో స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. బ్రహ్మోత్సవాల్లో పట్నం వారం, లష్కర్ వారం, మహా శివరాత్రి రోజున నిర్వహించే పెద్ద పట్నం, అగ్నిగుండాలు ప్రముఖ కార్యక్రమాలు, ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయం, రాజగోపురం, గదులకు రంగులు వేయించడంతో సుందరంగా కనిపిస్తున్నాయి. ఈ నెల 19న నిర్వహించే పట్నం వారంతో ఉత్సవాలు ప్రారంభమై 12 ఆదివారాలు కొనసాగుతాయి. 12 ఆదివారాలతో పాటు ప్రత్యేక కార్యక్రమాలకు భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తారు. భక్తులకు విశిష్ట దర్శనం, శ్రీఘ్రదర్శనం, ధర్మ దర్శనం కల్పించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈవో కె.రామాంజనేయులు తెలిపారు. పట్నం వారానికి ఆదివారం అధిక సంఖ్యలో హైదరాబాద్ భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకుంటారు. హైదరాబాద్‌కు చెందిన భక్తులు మల్లన్న పేరిట సట్టీ దీక్షలను 41 రోజుల చేపట్టి, పట్నం వారం స్వామిని దర్శించుకున్న అనంతరం, దీక్షను విరమిస్తారు. పట్నం వేసి గుట్టపై ఉన్న ఎల్లమ్మ తల్లికి బోనం సమర్పిస్తారు. పట్నం వారానికి 50 వేలకు పైగా భక్తులు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో హుస్నాబాద్ ఏసీపీ సతీశ్, చేర్యాల సీఐ శ్రీను, కొమురవెల్లి ఎస్సై రాజు పర్యవేక్షణలో పోలీస్ బందోబస్తు కల్పిస్తున్నారు. ఈ నెల 20న స్వామి వారి కల్యాణ వేదిక వద్ద పెద్ద పట్నం, అగ్నిగుండాల కార్యక్రమాన్ని హైదరాబాద్ ఒగ్గు పూజారుల ఆధ్వర్యంలో ఆలయ వర్గాల పర్యవేక్షణలో నిర్వహిస్తారు.

అనాగరిక దాడుల్ని మాలలు మానుకోవాలి

- ఎస్సీ వర్గీకరణ కోసం నిలబడ్డ నాయకులు, మేధావులను కంటికి రెప్పలా కాపాడుకుంటాం
- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేశ్ మాదిగ

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సికింద్రాబాద్, జనవరి 17: ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా నిలబడి ధైర్యంగా గొంతు విప్పి మాట్లాడుతున్న మేధావులు, ప్రజా నాయకులు, కళా నేతల మీద సామాజిక మాధ్యమాల్లో అసభ్య పద జాలంతో దూషిస్తూ అనాగరిక దాడులు చేస్తున్న మాలలు తమ పద్ధతిని మార్చుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేశ్ మాదిగ హెచ్చరించారు. ఉస్మానియా యూనివర్సిటీలోని ఆర్ట్ కళాశాల ముందు ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ మాదిగతో కలిసి ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ న్యాయమైనది కాబట్టే.. లోకమంతా ఏకగ్రీవంగా మద్దతు తెలుపుతుందన్నారు. వర్గీకరణను వ్యతిరేకిస్తూ సమాజంలో ఏకాకిగా నిలబడుతున్నది కేవలం మాలలు మాత్రమేనని అన్నారు. సమయం, సందర్భం వచ్చినప్పుడు గీత గీసి న్యాయం వైపు, ధర్మం వైపు నిలబడ్డవాడే నిజమైన వీరుడిగా, మేధావిగా నిల్చుతారని, ఇప్పుడు అలాంటి పాత్రనే డా. పృథ్వీరాజ్ యాదవ్, తెలంగాణ విఠల్, విమలక్క , డా. దరువు అంజన్న, సయ్యద్ ఇస్మాయిల్, నల్గొండ గద్దర్, రేలారే గంగ, తీన్మార్ మల్లన్న వంటి నాయకులు, అలాగే, ఎంఎల్సీ ప్రొ. కోదండరాం, జయప్రకాశ్ నారాయణ, ప్రొ. హరగోపాల్, ప్రొ. నాగేశ్వర్ రావు, కె.శ్రీనివాస్, నందిని సిధారెడ్డి, దేశపతి శ్రీనివాస్, వి.ప్రకాశ్ వంటి మేధావులు పోషిస్తున్నారని అన్నారు. వారి నిబద్ధతకు, వారి ధైర్యానికి మాదిగ జాతి, అలాగే సమాజం జేజేలు పలుకుతుందన్నారు. వారిని కంటికి రెప్పలా మాదిగ జాతి కాపాడుకుంటుంది. ఎన్నో సమస్యలకు పరిష్కారాలు చూపి దేశ వ్యాప్తంగా పేరు తెచ్చుకున్న మేధావుల మీద బండబూతులతో దాడులు చేయడం మాలలు చేస్తున్న సిగ్గుమాలిన చర్య అని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సోషల్ మీడియా తెలంగాణ అధ్యక్షులు ఇనుముల అనిల్ మాదిగ, ఎమ్మార్పీఎస్ హైదరాబాద్ జిల్లా అధికార ప్రతినిధి రొట్టెల సునీల్ మాదిగ, ఎంఎస్ఎఫ్ సీనియర్ నాయకులు సామ్రాట్ అజయ్ మాదిగ, హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి దావు ఆదిత్య మాదిగ, బొల్లికొండ వేణు మాదిగ, నర్వ దాసు మాదిగ, మంద అనీల్ మాదిగ, వంశీ మాదిగ, ప్రదీప్ మాదిగ, సైదులు మాదిగ, హరి ప్రసాద్ మాదిగ తదితరులు పాల్గొన్నారు

కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌ను రద్దు చేయాలి

గిరిజన సంఘాల నాయకులు

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు వినతి పత్రం ఇస్తున్న గిరిజన సంఘాల నాయకులు సంజీవ్ నాయక్, రమేశ్ నాయక్ తదితరులు

చిక్కడపల్లి, జనవరి 17: ఏజెన్సీ ప్రాంతాలను కలుపుతూ ఏర్పాటు చేయనున్న కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ (కేయూడీఏ)ను రద్దు చేయాలని గిరిజన సంఘాల నాయకులు గవర్నర్‌కు జిష్ణు దేవ్ వర్మకు శుక్రవారం వినతి పత్రం ఇచ్చారు. సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్యా సంజీవ్ నాయక్, లంబాడీ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు, న్యాయవాది రమేశ్ నాయక్ తదితరులు గవర్నరు కలిసి వినతినిచ్చారు. అనంతరం, వారు మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతాలను మున్సిపల్ కార్పొరేషన్‌లో కలపడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. కార్పొరేషన్‌లో కలుపడం మూలంగా గిరిజనులు హక్కులు కోల్పోతారని, ఉపాధి హామీ పథకాలు అమలు కావని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాలను యథావిధిగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో టీఎస్‌టీటీఏఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ మీరు నాయక్, సేవాలాల్ సేన రాష్ట్ర కో కన్వీనర్ బానోత్ హస్సేన్, బాడిష బిక్షం, బానోత్ రాములు నాయక్, సపావత్ బాలకృష్ణ నాయక్, బట్టు వీరన్న, మీరు నాయక్, పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మల్లారెడ్డి హాస్పిటల్‌లో 100 ఎంఐసీఎస్‌లు

- త్వరలోనే రోబోటిక్ సర్జరీ సేవలను అందుబాటులోకి..
- మల్లారెడ్డి హెల్త్ సిటీ చైర్మన్ డా.భద్రారెడ్డి, డైరెక్టర్ డా. ప్రీతి రెడ్డి

మినిమల్ ఇన్వేసివ్ గుండె సర్జరీలు చేయించుకుని కోలుకున్న రోగులతో మల్లారెడ్డి హెల్త్ సిటీ చైర్మన్ డా. భద్రారెడ్డి, డైరెక్టర్ డా.ప్రీతిరెడ్డి తదితరులు

దుండిగల్, జనవరి 17: హైదరాబాద్ మహానగర శివారు,సూరారంలోని మల్లారెడ్డి నారాయణ హాస్పిటల్‌లో (ఎంఐసీఎస్) మినిమల్లీ ఇన్వేసివ్ కార్డియాక్ సర్జరీలు 100 విజయవంతంగా జరిగాయని మల్లారెడ్డి హెల్త్ సిటీ చైర్మన్ డా. భద్రారెడ్డి, డైరెక్టర్ డా. ప్రీతిరెడ్డి తెలిపారు. మల్లారెడ్డి నారాయణ వైద్యశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో స్పెషల్ కార్డియాక్ సర్జన్ డా. హరీశ్ బడామితో కలిసి ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. గుండె రోగుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని అధునాతన టెక్నాలజీ 'మినిమల్లీ ఇన్వేసివ్ కార్డియాక్ సర్జరీ' ద్వారా కేవలం పది నెలల కాలంలోనే మల్లారెడ్డి నారాయణ వైద్యశాలలో 100 మందికి సర్జరీలు చేసినట్లు తెలిపారు. ఈ పద్ధతి ద్వారా రోగి చాతిపై మూడు ఇంచుల కోతతోనే విజయవంతంగా ఆపరేషర్లు నిర్వహించామన్నారు. ఈ అధునాతన టెక్నాలజీ కేవలం మల్లారెడ్